(కథ)

# ఊరిడిసిన బతుకులు

జి. అనసూయ



ఉదయపు నీరెండకు చెట్టూ పుట్టా అంతా బంగారు పూత పూసినట్టు మెరుస్తున్నాయి. వసంతకాలపు తొలిరోజులేమో, మోడుబారిని చెట్లూ పొదలు కూడా చివురు తొడిగి నవనవలాడుతున్నాయి. గట్టుమీద మోదుగు చెట్లు నిప్పురవ్వలు పూసినట్లున్నాయి. ఏరెంట దట్టంగ పెరిగిన ఏప, మేడి, గానుగ చెట్లమీద కాపురముంటున్న పక్షులు వింతవింత ధ్వనులతో ప్రకృతి విన్యాసానికి నేపథ్య సంగీతాన్ని వినిపిస్తున్నట్లున్నాయి. గట్టువారగా గలగల పారుతున్న నెమిలేరు ఆ పరిసరాలకు జీవాన్నిస్తున్నట్లుంది

గట్టుమీదకు మేకల తోలుకపోయిన అలివేలు దూరాన బాటంట దుమ్ము రేపుకుంట వస్తున్న జీపు చప్పుళ్ళకు ఉలికిపడి తేరిపార చూసింది. ఒకటికాదు రెండుకాదు పది పదిహేను జీపులు బొయ్యిబొయ్యని సప్పుడుజేసుకుంట దూరంగా ఏటిప్రక్కన ఆగినవి. ఎప్పుడన్న పోలీసోళ్ళు లేదంటే ఎలచ్చన్లప్పుడు తప్ప తమూరికి జీపులు ఎప్పుడూ రావు.

తాము ఏడికి పోవాలన్న నాలుగు కోసులు నడ్సి రోడ్డుకాడికి పోతేగాని బస్సు అందదు. మరి ఇయ్యాల ఇన్ని జీపులు ఎందుకొస్తున్నయ్యాబ్బా అనుకుంది అలివేలు.

అలివేలుకు వన్నెం దేళ్ళుంటయ్యేమో. పచ్చటి పసిమి చాయ తెల్లవారు ఝామున విచ్చుకున్న పువ్వుల్లాంటి పెద్దపెద్ద కళ్ళు, నల్లమబ్బులాంటి చిక్కని జుట్టు, చుక్కలాంటి పిల్ల అని బుగ్గలు నొక్కుకుంటారు అందరూ. పుట్టిన నాటినుండి మాలిమైన కొండా కోన, వాగూ వంకా, వీచేగాలి, పాడే పిట్టా అన్నీ ఆమె నేస్తాలే. ఆమెగాసే మేకల గుంపు గూడా ఆమె చుట్టూ తిరుగుతూ ఆమె కంటిచూపే ఆజ్ఞగా పాటిస్తాయి.

"అలివేలూ... ఓ అలివేలూ ఏడున్నవు పోరీ!" అవ్వ కేకకు ఉలిక్కిపడ్డ అలివేలు

"ఈడున్న అవ్వా పెద్ద ఏపచెట్టుకాడ" అంటూ బదులిచ్చింది. కిందా మీదా పడుతూ గట్టు ఎక్కి వచ్చిన గౌరమ్మ మనవరాలికి సద్దిమూట అందిస్తూ

"అడివిలకొస్తే ఆకలిమాటే మర్చిపోతావు గదే ఇగో ఈ సద్ది తిను పొద్దు బారెడెక్కింది ఇప్పటికే" అంది గౌరమ్మ.

అవ్వా మనూర్లకు కూడా శానా జీపులొచ్చినయి ఎందుకే అగో ఆడ వాగు మొగల శానామంది ఉన్నరు చూడు కళ్ళమీదుగా చెయ్యడ్డు పెట్టుకుని ఆదిక్కుకు చూపింది అలివేలు.

"ఏందోనే ఊర్లంత గోల గోలగ ఉంది. గీవాగుమీద అడ్డంకట్ట కడ్తరంట. ఊర్లె శానమంది కట్టకట్టనియ్యం మన ఊర్లన్ని మునిగిపోతయి. గాడ ఎవరికో నీళ్ళు ఇయ్యడం కొరకు మా ఊళ్ళను ముంచుతరా! " అంటున్నరు.

"అవునే అవ్వా మరి అడ్డంకట్ట కడితే గీ అడవంత, మన గూడాలన్ని నీల్లల్ల మునగవా"

"వస్తయి... ఊళ్ళన్ని ఖాళీచేసి పోవాల్నంట, గాడ్నేదో సర్కారోల్లు జాగా ఇస్తరంట. ఆడ గుడిసెలేసుకోవాల్నంట ఊర్లంత గదే జెప్పుకుంటున్నారు. భూములు మునిగెటోల్లకు పైసలిస్తరంట"

"మరి మనకు భూమిలేదు గదనే. ఈ ఊరు మునిగిపోతే మనమెట్ల బతకాలి... ఇప్పుడైతే ఈ గట్లమీద మేకల మేపుకుంటున్నం. అడవిల కట్టెలు తెచ్చుకుంటం, పండ్లో, కాయలో ఏరి తెచ్చుకుంటున్నం. ఈగట్లన్ని మనవి కాదానే..." మనూరు ఇడిసిపెట్టి మనమెందుకు పోవాలే తనలో తానే గొణుక్కుంది అలివేలు.

గౌరమ్మ, కూతురు అల్లుడు ఇద్దరూ విషజ్వరాలు వచ్చి చచ్చిపోతే మిగిలిన మనవరాలు అలివేలును తానే సాది పెద్ద చేసింది. కొడుకు యాదగిరి నాలుగేండ్ల నాడు మేకల దోల్కొని అడివికి పోయినోన్ని అన్న అనుకుని పోలీసోల్లు కాల్చిసంపిరి. ఆర్నెల్లు దిరగకుండనే కలరా బీమారి వచ్చి కోడలు చచ్చిపోయె. ఉన్న ఒక్క మనవడు శీను పదో తరగతి చదువుకున్నాడు. ఇంకా సదివితే మాట ఇనడని పెద్ద పటేలుకాడ తోటపనికి పెట్టింది. రక్తసంబంధం దూరం కాకూడదని వాళ్ళిద్దరికి పెండ్లి చేసింది. అలివేలు ఇంకా పెద్దది కాలేదు. వాళ్ళిద్దరు సల్లగ బ్రతికి పిల్ల పాపల్తో వుంటే సాలు రోజుకోసారి కనిపించని దేవుళ్ళకంతా మొక్కుకునేది గౌరమ్మ.

ఇప్పుడు ఈ ఆనకట్ట గడతరని తెలిసినప్పటి నుండి మనసంతా బుగులేసింది. చెట్టు కొట్టేస్తే తలో దిక్కైన పచ్చుల్లాగ ఊరు మునిగిపోతే మేమేడికి పోవాలి. రెక్కలు రాని ఈ పిల్లలు ఎట్ల బ్రతుకుతరు. ఈడ ఎట్లనో నాలుగు జీవాలను మేపుకుంట, కాయో, కసరో తినుకుంట బ్రతుకు ఎల్లదీస్తున్న తాము గాడేడ్నో పట్నం వేసాలు, పోకడలు మాకు ఏంతెలుస్తయి.

గౌరమ్మ ఆలోచనలన్ని మనవలమీదనే. విరగబూసిన మోదుగ చెట్టులాగ ఉన్న మనవరాలిని చూస్తూ దిగులుపడింది.

ఏడ ఏడనుండో పెద్దపెద్దోళ్ళు వచ్చింద్రు. ఆడ ప్రాజెక్టు కడితే కలిగే నష్టాల గురించి చెబుతున్నరు. జనాన్నంత పోగుచేసింద్రు. మా ప్రాణాలు అడ్డేస్తామన్నారు. పోలీసులు వచ్చింద్రు ఆందోళన జేసినోల్లను పోలీసులు పట్టుకుపోయింద్రు. ఊరు ఊరంత అడ్డంపడ్డా ప్రాజెక్టు శంఖుస్థాపన ఆగలేదు. పోలీసులను చుట్టుపెట్టుకొని ప్రారంభోత్సవం చేసింద్రు. కలెక్టర్ వచ్చిండు. గ్రామ ప్రజలకు ఇళ్ళస్థలాలు ఇస్తమన్నరు. అందరికి ఉద్యోగాలు ఇస్తమన్నరు. బుజ్జగించింద్రు. ఇదే ప్రజాభిప్రాయమంటూ వాళ్ళకు కావలిసినట్లు రిపోర్టులు వంపించింద్రు. మరో రెండు నెలల్లో పని మొదలయ్యింది. చేతి నిండా పని దొరకగానే రాబోయే ప్రమాదాన్నిమరచిపోయింద్రు జనం. కట్ట పూర్తయ్యింది. ఊరంతా ఖాళీ చెయ్యాలని హెచ్చరికలు ఇవ్వాల్సిన నష్టపరిహారం సంగతి మాట్లాడే వాళ్ళే లేరు. చూపిస్తామన్న ఇండ్ల స్థలాల మాటే మరిసింద్రు. ఉపాధిమాట దేవుడికి తెలవాల

### 'బ్రహ్మర్షి' జయంతి

బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు 1-10-1862 బందరులో జన్మించారు. మద్రాసు వచ్చయప్ప కళాశాల,బందరు నోబుల్ కళాశాలల్లో ఉపన్యాసకునిగా పనిచేశారు. వివిధ కళాశాలల్లో ప్రధానాచార్యులుగా పనిచేశారు. ముట్నూరు కృష్ణారావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య మొదలైనవారు వీరి శిష్యులే. పిఠాపురం రాజావారు వీరిని గురువుగా గౌరవించేవారు. 1911లో పిఠాపురం మహారాజా కళాశాల (కాకినాడ) లో మొదటిసారిగా మహిళలను చేర్చుకుని సహవిద్యకు దారి చూపారు.

రాత్రికి రాత్రి ఊరు ఖాళీ చేయించిండ్రు.

అలివేలుకు పదిహేనేండ్లు ఎల్లి పదహారు వచ్చినవి. పట్నం పోదామయ్యా అంతమంది బ్రతుకగా లేనిది మనను వద్దంటదా ఏంది అంటూ ధైర్యం చెప్పింది. ఈడ మాత్రం మనకేముంది. ఈ గుడిసె తప్ప ఏం భూములా తోటలా అని తనకు తాను ఓదార్చుకుంది. వృద్ధాప్యంలో నైరాశ్యంతో కృంగిపోయిన అవ్వను తీసుకొని మూటముల్లె సర్దుకొని పట్నం బాటపట్టిండ్రు.

బస్సుల కూర్చుని వెనక్కు పోతున్న నెమిలేరుని, గుట్టలను చూస్తూ కన్నీళ్ళు తుడుచుకుంది. పొద్దు వాలుతుండగా పట్నం చేరుకున్నరు. గౌరమ్మకు వరుసకు వదినైన కనకాలు ఏనాడో పట్నం వచ్చి బ్రతుకుతున్నరు. కనకాలుకు ఇద్దరు కొడుకులు. రిక్షా తొక్కుతారు. భర్తఅనారోగ్యంతో మంచం దిగడం లేదు.

"ఏరా శీను నువ్వుకూడా రిక్షాదొక్కుతావా" అడిగిండ్రు కనకాలు కొడుకులు.

"అన్నా రిక్షా తొక్కుడు కాదుగానీ రోడ్డు వారంట ఏడన్న అడ్డచూసి చాయదుకాణం పెట్టుకుంటం. ఇద్దరం చెరోపని చేసుకుంట ఎల్లదీయొచ్చు' అంది అలివేలు.

"రోడ్కు ప్రక్కన బండి పెట్టుకోవాలన్నా పగిడి కట్టాల. ఉండనీక ఓ రేకుల గద్దైన కావాలె. మొత్తానికి నాలుగైదు వేలయిన కావాలె" అన్నడు కనకాలు పెద్ద కొడుకు రాములు.

"ఇగో అన్నా జీవాలను అమ్మగా వచ్చిన రెండు వేలు వున్నయి. నా చెవుల కమ్మలు, వెండికడాలు అమ్మితే రెండు వేలన్న వస్తుండొచ్చు. వీటితో పని కాదంటావా" అన్నది అలివేలు.

"చెల్లమ్మ తెలివికల్లదే ఏం బావా నీవుకూడా సరే అంటె ఏదైన జాగ జూతం" అన్నడు రాములు.

పెద్ద రోడ్డంట పేవ్‌మెంట్ మీద రెండు గజాల జాగ దొరికింది. పక్కనున్న బ్యాంకు బిల్డింగు మెట్లకింద తడక అడ్డంపెట్టి ఉండనీక ఏర్పాటు చేసుకున్నారు. ఓచెక్క బల్ల, రెండు స్టూళ్ళు ఓ స్టవ్వు కొనుక్కున్నరు. పాలు, టీపొడి, చక్కెర ఏ రోజుకారోజు కొనడమే. ఎల్లాగైతేనేం టీకొట్టు ప్రారంభమైంది. పల్లె తల్లివంటిది, పట్నం ప్రియురాలి వంటిదంటే ఏమిటో అర్ధమవుతుంది. మెల్లిమెల్లిగ కష్టపడేవాడికి కడుపు నిండడమే గగనమైతే, పని పాటు లేని వీధి రౌడీలకు, దాదాలకు పేదోళ్ళ కడుపుగొట్టటమే జీవనోపాధి. నెలనెలా మామూళ్ళు వసూలు చేసే గూండాలు, పొద్దున్నే అప్పులోళ్లా వచ్చిపడే వీధిరౌడీలు, వెకిలి వేషాలు వేసే వెధవల నోరు మూయించే గడుసు తనాన్ని అలవాటు చేసుకుంది అలివేలు తొందరగానే. అయిదారేండ్లు గడిచి పోయినయి. ఇద్దరు బిడ్డల తల్లయ్యింది. అవ్వ పండుటాకులా వణుకుతున్నది. నేడో రేపో రాలిపోయేటట్లున్నది. తిని తినక దాచుకున్న డబ్బంత పోగుజేసి బ్యాంకులో కొంత అప్పుజేసి ఓ యాభై గజాల స్థలం కొన్నరు. ముందర రేకులు ముందుకు దింపి హోటల్ నడుపుతూ వెనుక భాగంలో కాపురం చేస్తూ గుట్టుగా రోజులు గడుపుతున్నరు. అలివేలు కుటుంబం. పట్నవాసపు వస్తు సంస్కృతికి ఇప్పుడిప్పుడే అలవాటు పడు తున్నరు. పిల్లలను ఫీజులు కట్టిప్రయివేటు బళ్ళో చేరిపించిండ్రు.

అలివేలుకు తన చిన్నతనం నెమిలిపురం చుట్టూ అల్లుకున్న తన బాల్యం గుర్తొచ్చినప్పుడల్లా కళ్ళు చెమర్చేవి. నల్లాల మందు నీళ్ళు త్రాగుతున్నప్పుడు నెమిలేరు నీళ్ళు గుర్తొచ్చి ప్రాణం విలవిలలాడేది.

ఉన్నట్టుండి ఓరోజు పొద్దున్నే నోటీసులు వచ్చినయ్. రోడ్డు వెడల్పులో అటూ ఇటూ ఇరవై గజాల పోతున్నయని... ప్రక్కనున్న ఇండ్లు, దుఖాణాలు

**ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం**

జంతు సంక్షేమానికి సంబంధించి అక్టోబర్ 4, 1960లో పార్లమెంట్‌లో చట్టం ప్రవేశ పెట్టింది. ఈ చట్టం ప్రకారం జంతువు లను ఉద్దేశ్యపూర్వకంగా గానీ, నిర్లక్ష్యం గా గాని బంధించినా, ఇబ్బంది కలిగించి నా శిక్షార్హులు. 26-12-1960 నుంచి ఈ చట్టం అమలులోకి వచ్చింది. మూఢ నమ్మకాలను నివారించేందుకు 1950లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జంతువుల, పక్షుల బలి నిషేధ చట్టాన్ని ప్రవేశ పెట్టింది.

**మొదటి రైల్వేస్టేషన్**

9-10-1874నహైదరాబాద్‌లో మొదటి రైల్వే స్టేషన్‌ప్రారంభించబడింది. మైసూరు ఇతర దక్షిణాధినంస్థానాధీశుల నుండి ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు హైదరాబాదును మిలటరీ బృందాల స్థావరంగా చేయాలనే భావనతో బొంబాయి-మద్రాసు రైల్వే మార్గంలో హైదరాబాదు ను కలపాలని నిర్ణయించారు. బెంగాలుకు చెందిన సింధియా రైల్వే ఇంజనీర్ మీడే అధ్వర్యంలో ఎన్.ఎస్.ఆర్.వాడి-హైదరాబాదుల మధ్య110మైళ్ళ పొడవున రెండు కోట్ల రూపాయలు వెచ్చించి బ్రాడ్ గేజ్ లైనును నిర్మించింది.

వెంటనే ఖాళీచెయ్యాలనీను.

అలివేలుకు గుండె గుభేలు మంది.పదివేలుపోసి కొనుక్కున్న జాగా ఇంకా అప్పైన తీరలేదు. ఇప్పుడు ఏం చెయ్యాలి. జాగా కాగితాలుతీసు కొని తమలాంటి నలుగుర్నిపోగేసుకొని ఎమ్.ఎల్.ఎ. దగ్గరకు పోయిండ్రు.

మీకేం పర్వాలేదు. నేను న్నానన్నడుఎమ్మెల్యే . కోర్టుల వేసి స్టే ఆర్డరు తెచ్చుకొన్నరు. కన్నపడోళ్ళ కాళ్ళు పట్టుకొని వకీలుకు తలా వెయ్యిరూపాయలు యిచ్చి ఆర్డరు తెచ్చుకున్నరు. వేరే స్థలం ఇప్పిస్తమన్నరు, నష్ట పరిహారం వస్తదన్నరు. నెల గడిచి పోయింది.

ఓ తెల్లవారు ఝామున ప్రొక్లేనర్లు రానే వచ్చినయ్. భూతాలంటి యంత్రపు కోరలతో గోడలకు గోడలే, కప్పులకు కప్పులకే లేచి పోయినయి. ఇంట్ల సామాను తియ్యనీక కూడా సమయం ఇవ్వలేదు. పిల్లలతో, ముసలామెతో రోడ్డుమీదకు వచ్చి భోరున ఏడ్చింది అలివేలు. బాధతో, భయంతో నోట మాట రాలేదు శీనుకు. అర్ధగంటలో ఇల్లంత నేల మట్టమయ్యింది. వాళ్ళు ఏడుపు ప్రొక్లెనర్ శబ్దంలో కలిసిపోయింది. అది రేపిన దుమ్ము ధూళిలో వాళ్ళ కన్నీళ్ళు ఇంకిపోయాయి. వాళ్ళ అరుపులకు, ఏడుపులకు స్థానిక నాయకులు వచ్చారు. పోటోలు తీసిండ్రు, వీడియోలు గుంజిండ్రు. అన్న పొట్లాలు పంచిండ్రు. ఓదార్పు మాటలు చెప్పిండ్రు చీకటి పడేసరికి ఎక్కడోళ్ళు అక్కడ పోయిండ్రు. కట్టు బట్టలతో పిల్లలతో నడవలేని వృద్ధురాలైన అవ్వతో ఫుట్‌పాత్‌మీద నిలబడ్డ అలివేలుకు ఏంచేయాలో ఎటుపోవాలో తోచలేదు. ఆమె మెదడు ఆలోచించడం మానేసింది. శీను ఎక్కడెక్కడో తిరిగి ఓ మురుగుకాలువ పక్కనున్న రేకుల రూం చూసొచ్చిండు. ఆ నీడన చేరిండ్రు. ఇదంతా చూసి వారం తిరగకముందే ముసలామె ప్రాణాలు పోయినయి. నెల్లాల్లు పనంతా వదిలేసి ఎమ్మెల్యే చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరిగిండు శీను. పూట గడవడం కొరకు ఉప్పరి పనికి పోతున్నది అలివేలు. పిల్లలు బడులు మానేసి ఇండ్లల్ల పనికి పోతున్నరు. తిరిగి తిరిగి విచ్చోడిలా మారిన శీను నిద్రపట్టక రోజు త్రాగుడు మొదలు పెట్టిండు. రాను రాను త్రాగంది ఉండలేని స్థితికి వచ్చిండు. ఇంత జరిగినా నిబ్బరంగా కష్టం చేసి కుటుంబాన్ని పోషిస్తున్న అలివేలును చూసి ఉక్రోశంతో ఏదో ఒకటి అనేవాడు. బదులు రాకపొయ్యేసరికి బలహీనత కోపం రూపంలో బుసకొట్టేది. చేతికి ఏది దొరికితే అది విసిరి కొట్టే వాడు. అలివేలును గొడ్డును బాదినట్లు బాదేవాడు.

పద్నాలుగేళ్ళ కొడుకు వీరన్న చెడుతిరుగుళ్ళు తిరుగుతున్నాడని, రౌడీలా తయారయ్యాడని ఆనోటా, ఈనోటా విన్నప్పుడు ఏనాడు కన్నీళ్ళను చెలియలి కట్టదాటనివ్వని అలివేలే వెక్కివెక్కి ఏడ్చింది. "నాయనా వీరయ్యా నీవు మంచి పేరు తెచ్చుకోవాలిరా, ఇన్ని కష్టాలు పడుతు బ్రతుకుతున్నది మీరైనా బాగుండాలనేరా"! అంటూ కొడుకును పట్టుకొని భోరుమంది.

"అమ్మా నేనేమీ చెడిపోలేదు. ఈరోజుల్లో మంచివాడిని పిచ్చివాడంటుందమ్మా లోకం. తిని, తాగని వాడిని సంపాదించలేని వాడ్ని చేతగాని వాడంటుంది. నలుగుర్ని తన్నగలిగేవాడికే భయపడతారు జనం. ఈలోకం నీవనుకున్నంత మంచిది కాదమ్మా అణిగి వుండేకొద్ది అణగ దొక్కటానికి ప్రయత్నిస్తారు. మనం ధైర్యం చేస్తే తోక ముడుస్తారు."

ఏమోరా వీరా! నీకు ఏదైనా ఆపద కలుగుతా దేమోనని నా భయం. దేవుడి దయవల్ల మీరు పెరిగి పెద్దోళ్ళయితే నాకంతే చాలు చేతులు జోడించి కనపడని దేవుడికి దండం పెడుతూ అంది అలివేలు.

"ఆదేవుడి దయవల్ల ఎవ్వరు ఏమీ కారమ్మా,

కాలగతిలో ఏది ఎలా జరగాలో అదే జరుగుతుంది. మారుతున్న కాలంతోపాటు మనమూ మారాలి. ఆ దేవుడే వుంటే ప్రపంచంలో ఇన్ని అన్యాయాలూ, అక్రమాలు జరుగుతాయా. బ్రతికినన్నాళ్లూ ఏటికి ఎదురీది బ్రతకాల్సిందే. చావు అనివార్యమమ్మా. మనిషి ఒక్కసారేగా చస్తాడు. రోజు రోజు భయపడుతూ... చచ్చేకంటే అన్యాయాన్ని ప్రతిఘటిస్తూ ధైర్యంగా బ్రతకడమే మనపని" అన్నాడు వీరయ్య.

తన కడుపున పుట్టి తనముందే ఎదిగి తనకే బుద్ధులు చెబుతున్న తన బిడ్డను కళ్ళార్పకుండా చూసింది అలివేలు. నిజమేనేమో తన నలభై ఏళ్ళ జీవితంలో తను నమ్ముకున్నవేమీ తనకు దక్కలేదు. కన్న తల్లిలాంటి ఊరు నట్టేట్ల మునిగింది. కొంప గోడు ఇష్టమన్న సర్కాకు వట్టి చేతులు చూపింది. కట్టుకున్నోడు కాలమాడిన మాయ నాటకంలో నలిగిపోతున్నాడు.

కాళ్ళకింద భూమి కదిలిపోతున్నట్లు మనుషుల మధ్య సంబంధాలు కరిగిపోయి స్వార్ధమే మిగిలింది. మారుతున్న కాలంతోపాటు మారకపోవడం మా తప్పేనేమో అనుకున్నది అలివేలు. ★

**రచయితలకు విజ్ఞప్తి**

**'చినుకు' లో సమీక్షకు రెండు ప్రతులు పంపడం తప్పనిసరి.**

# నేను

నిరంతర
విద్యుత్ ప్రవాహాన్ని
అవాంతరాలు లేని
అనంత ప్రసారాన్ని
చీకట్లు కమ్మిన
కళ్లకు
కాంతిరేఖని
మట్టివాసనల
చెమట బిందువుని
రూపరసగంధ
స్పర్శలతో
వీనుల విందుని
నేనెవరినా?
మానవత్వపు
వేవ్‌లెంగ్త్‌ని
నిత్యం
శక్తిని నింపే
ఛార్జర్‌ని
కవిని !!

–డా॥చాగంటి తులసి

# కన్నీటి శ్లోకం

కన్నీటిని, కలవరాన్ని
కలంలో దాచుకుని
ఒంటరిగా శూన్యంలో
దిగులుతో కుమిలిపోతున్నాను
తనువు మీద కనిపించని
శ్వాసల గాయాల నిండా
కాలిపోయిన స్వప్నాల చప్పుళ్లు.
వెక్కి వెక్కి ఏడ్వాలన్నా
నా గొంతులో భాష ఎక్కడిది
ఈ ప్రపంచం నుండి విడిపోయిన
ఒక లేత నక్షత్రాన్ని నేను!
అక్షరాలే నా దిక్కులు
చీకట్లు అలుముకున్న కళ్లతో
వాటిని చదవలేకున్నా,
స్పర్శలనే బాటలుగా
చూసుకుంటున్నాను.
శోకాన్ని శ్లోకంగా ఆలపిస్తూ
నాకు నేనే
అనంతంలోకి నడిచిపోతున్నాను!

– మందాది గోపీనాథ్